# పందెపు గుఱ్ఱాలు

మధ్యాహ్నం భోజనాలు ముగించి గంటయింది. ఏదో పత్రిక చేత్తోపట్టుకున్నానన్న మాటేగాని చదివిందేమి తలకెక్కడంలేదు. ముందు గదిలోంచి మా పిల్లల అల్లరి, అరుపులు చెవులు హోరెత్తిపోతున్నాయి. మా వారు మాత్రం గురక పెడుతున్నారు హాయిగా. రాళ్ళవర్షానికికూడా చెదిరిపోని ధ్రువుని తపస్సులాంటి దాయన నిద్ర. పిల్లలు దూరంగా ఉన్నంతసేపు రాత్రింబవళ్ళు వాళ్ళ ధ్యాసే నాకు. సెలవలకు వాళ్ళు ఇంటికి వస్తే వాళ్ళ అల్లరి భరించలేను. చిన్నతనంలో అమ్మానాన్నల భయానికి, ఇంట్లో పిల్లుల్లాగా ఉండి బైటికి వెళ్ళి అల్లరి సాగించుకునే వాళ్ళు. గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లు అవుతూంటే మా భయం తగ్గిపోయి బైట బుద్ధిగా ఉండడం, ఇంట్లో అల్లరి చెయ్యడం మొదలు పెట్టారు. పదిమందిని పోగుచేసుకురావడం, ఏదో వాదులాడుకోడం. లేకపోతే పొద్దున ఇల్లు విడిచి వెళితే, సాయంత్రందాకా పత్తా ఉండరు. జంతికలో, చేగోడీలో చేసి డబ్బాలో పోస్తే, సాయంత్రానికి ఒకటి మిగలదు. నిరుటివరకూ మా ఇంట్లో ఎంత సందడి ఉన్నా ఏదో అపశ్రుతి ఉండేది. ఈ ఏడాది మా ఇంట్లో నవ్వులెక్కువ, మాటలు తక్కువ అయ్యాయి. ఈ మధ్య మాకేదో లాటరీలో లక్షలు వచ్చాయనుకునేరు. అదేమీకాదు. కాని మేమంతా పెద్ద గండం గడిచి బైటపడ్డాము. ఆ గతి గుర్తుకువస్తేనే ఒళ్ళు జలదరిస్తుందిప్పుడు. సరిగ్గా ఏడాది కిదంట ..., ఆ రాత్రి....

పన్నెండయింది. నిద్రతో నా కళ్ళు వాలిపోతున్నాయి. రాంబాబుకు బాగా నిద్రపట్టింది. సరిగ్గా ఒంటిగంటకు వాణ్ణి లేపి మందివ్వాలి. అందుకే పడుకోడానికి భయంగా ఉంది నాకు. మూడు రోజులుగా రోజు డాక్టరు మూడుసార్లు వస్తున్నా, ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నా, రాంబాబుకు జ్వరం నూటమూడు డిగ్రీలకు తగ్గడం లేదు. ఏడు రోజులైందీ జ్వరం వచ్చి. టైఫాయిడ్ కాదన్నారు. ఏమి జ్వరమో తెల్సుకోడానికి రక్తంతీసి గుంటూరు హాస్పిటల్‌కు పంపించారు రక్తపరీక్ష కోసం. ఇంకా రిపోర్టు రాలేదు. తలమీద కొండను మోస్తున్నట్లుగా ఉంది మరీ మూడు రోజుల నించి నాకు. ఏదో వేళకు ఇంత అన్నం వార్చేస్తున్నాను. వారు, పిల్లలు అప్పడాలతో, ఆవకాయతో, పెరుగుతో కాలక్షేపం చేస్తున్నారు. ఏం చెయ్యను మరి? రాంబాబు పక్క విడిచి పది నిమిషాలు దూరంగా ఉండలేకపోతున్నాను. ఎప్పుడు సరదాగా ఉండే మా పిల్లలు నన్నూ, రాంబాబును చూసి దిక్కుమొఖాలేసుకుని అవతలకు వెళుతున్నారు. మా అమ్మాయి సవిత అత్తవారింట్లో ఉంది. వచ్చి పది రోజులుండి వెళ్ళమని నిన్ననే ఉత్తరం వ్రాశాను. అది వస్తేకాని మగపిల్లలు కాస్త తేరుకోరు.

రాంబాబు నాకు చెల్లెలి కొడుకు. మా చెల్లెలు నాకన్నా ఆరేళ్ళు చిన్నది. ఆ రోజుల్లో మా నాన్న మమ్మల్ని కాలేజీలకు పంపలేదు. మాకు త్వరగానే పెళ్ళిళ్ళు చేశారు. మా అమ్మ మా చిన్నతనంలోనే పోయింది. మా నాన్నగారికి నా మీదకన్న, మా చెల్లెలిమీదే ఎక్కువ ఆపేక్ష. చిన్నప్పుడు ఆ విషయమై నేను చాలా బాధ పడ్డమాట నిజమే కాని, పెళ్ళి అయి నా సంసారం నాకు ఏర్పడ్డాక, ఆ చింత తగ్గిపోయింది. మాకు ముగ్గురు పిల్లలు. మొదటిది సవిత, తరవాత సత్యం, సుందరం. మా చిన్నబ్బాయి సుందరంకన్నా ఆరునెలలు పెద్దవాడు రాంబాబు. రాంబాబుకు పదినెలల వయస్సులో మా చెల్లెలు డబుల్ న్యుమోనియా వచ్చి చనిపోయింది. "రాంబాబుకు నువ్వే దిక్కమ్మా!" అంటూ ఏడ్చారు మా నాన్న నన్ను చూసి. కాని మా మరిదికి తన కొడుకు పరాయి పంచల్లో బ్రతకడం ఇష్టం లేదు. ఎంత అడిగినా రాంబాబును మాతో పంపనంతే

పంపనన్నాడు. పనిమనిషి సాయంతో తనే పెంచుకున్నాడు కొడుకును. ఏడాది తిరక్కుండా మా మరిది ఒకరోజు మోటార్ సైకిలు ప్రమాదానికి బలి అయిపోయాడు. మా మరిదికి ఉద్యోగం తప్ప స్థిరచరాస్తులేమీ లేవు. కనక కొడుకుకోసం అతనేమీ వదిలిపోలేదు. అప్పుడు రాంబాబును మేము మా ఇంటికి తీసుకువచ్చాం. తరవాత కొద్దిరోజులకు మా నాన్నగారి స్నేహితుడొకాయన మా ఇంటికి వచ్చారు. నాన్న తమ స్వార్జితమైన ఇంటిని, మూడెకరాల మాగాణి భూమిని రాంబాబుపేర వ్రాసి, ఆ పత్రం నాకు పంపించారు. మూడు వేలో, నాలుగు వేలో తీసుకుని తీర్థయాత్రలకి వెళ్ళారట నాన్న. ఏ మఠంలోనో ఉండిపోతాను, మరి తిరిగిరానని చెప్పారట. అయిదేళ్ళనాడు మాకు తెలిసినవాళ్ళు హృషికేశం వెళితే అక్కడ కనపడ్డారుట నాన్న. మా ఎవరి సంగతి, ఆఖరికి రాంబాబు సంగతికూడా అడగలేదట నాన్న. "నిజంగా ఋషులైపోయారండీ వారు!" అన్నారు చూసివచ్చిన వాళ్ళు. నాన్న ఆస్తిలో కాస్తంతయినా నాకుగాని, నా పిల్లలగ్గాని ఇవ్వకుండా, అంతా రాంబాబుకే వ్రాసి ఇవ్వడం నాకు నచ్చలేదు. చాలా సిగ్గుపడిపోయి "నాన్న చేసిన పనికి మీకు కోపం రాలేదా?" అని అడిగాను మా వారికి క్షమార్పణ చెప్పుకుంటున్నట్లుగా. ఆయన నవ్వి "మీ నాన్నగారు తెలివైనవారు. మన పిల్లలకు నువ్వూ, నేను ఉన్నాం. రేపు నీ బుద్ధి, నా బుద్ధి చెడిపోతే రాంబాబుకు అ డబ్బే దిక్కవుతుంది" అన్నారు. నాన్నకు నామీద ఆపాటి నమ్మకం లేకపోయింది గదా అనుకున్నాను. ఎప్పుడు నాన్నకు చిన్న చూపే నా మీద, నా గుణంమీద!

నా పిల్లలను గురించి నేను డాబులు చెప్పుకోవడం కాదుగాని, వాళ్ళు ముగ్గురు చాలా తెలివైనవాళ్ళు. మా సవిత తెలివికితోడు పుస్తకం పురుగు. ఇంటిపని అంటే చిరాకు దానికి. ఎప్పుడూ ఫస్టుమార్కులే తెచ్చుకునేది. ఎప్పుడేనా క్లాసులో రెండోదిగా వస్తే "ఇంకెవరో ఫస్టు వచ్చేశారో" అంటూ ఏడ్చి రోజంతా తిండి మానేసేది. దాన్ని, దాని ఏడుపును చూస్తే గరిట కాల్చి వాత పెట్టాలనిపించేది నాకు. మా పెద బాబు సత్యం అడపా దడపా ఫస్టుమార్కులు తెచ్చుకునేవాడు. కాని [illegible] మంచి మార్కులతో పాసయ్యేవాడు. తల్లిదిష్టి తగలదంటారు

ఎనకనే చెబుతున్నాను, వాడి ఆరోగ్యం చాలా మంచిది. ఆటల్లో మంచి ప్రావీణ్యం సంపాదించుకున్నాడు. మా చినబాబు సుందరం ఏకసంథ గ్రాహి. ఎప్పుడూ పత్రికలో, కథల పుస్తకాలో చదువుతున్నట్లే ఉంటాడు. మార్కుల్లో అన్నయ్య రికార్డు, అక్కయ్య రికార్డులను అధిగమించాడు. సినిమా పాటలు కమ్మగా పాడేవాడు. మా అమ్మాయికి మార్కులపొగరే కాని, కూనిరాగం తియ్యడమన్నా చేతకాదు. వీళ్ళ ముగ్గురి మధ్యా నా బ్రతుకు, రాంబాబు బ్రతుకు ముళ్ళమీద నడకలాగ గడిచింది.

రాంబాబు, సుందరం ఒక ఈడువాళ్ళవడాన ఒకే తరగతిలో చేర్పించాం. నెలకొకసారి మార్కులిస్టు ఇంటికివస్తే, రాంబాబు వారం రోజుల దాకా తలవంచుకుని తినిపోయేవాడు. సుందరంతో కలిసి స్కూలుకి వెళ్ళాలంటేనే బెరుగ్గా ఉండేది వాడికి. కొన్నాళ్ళు ప్రత్యేకంగా రాంబాబుకు ట్యూషన్ పెట్టించి చూశాము. లాభం లేకపోయింది. పంతులమ్మ పాఠం చెబుతూంటే వాడు దూరంగా ఉడతలవంకా, పిచ్చుకల వంకా చూస్తుండేవాడు. ఒక ఏడాది పరీక్ష తప్పి సుందరంకన్నా వెనక పడ్డాడు. రాంబాబుకు చదువు ధ్యాస లేదని గ్రహించిన మా అమ్మాయి తమ్ముళ్ళకు పురెక్కించి "చదివి చెడినవారూ లేరు, చదవకపోతే పోతారూ!" అంటూ రాంబాబు చుట్టు గంతులు వేయించేది! అది చూసి నాకు చిర్రెత్తి మా అమ్మాయిని పిలిచి "అమ్మా, నాన్నా లేనివాణ్ణి అట్లా ఆటలు పట్టించడానికి నీకు సిగ్గులేదా, సవితా?" అన్నాను. సవిత దెబ్బ తిన్నట్లయి నా వంక చూస్తూ "రాంబాబుకు అమ్మా, నాన్నా లేరని గుర్తు పెట్టుకోవడానికి నీకు సిగ్గెయ్యడం లేదామ్మా! నీ పిల్లలు మంచి మార్కులు తెచ్చుకుంటూంటే, రాంబాబు పరీక్షలు తప్పుతూంటే నీకు సిగ్గెయ్యడం లేదామ్మా? పక్కింటివాళ్ళబ్బాయి పరీక్ష పదిసార్లు తప్పినా నాకేమి పట్టదు. నా తమ్ముళ్ళు తప్పుతేనే నాకు బాధ. కాస్త రోషం తెప్పిస్తే వాడు బాగు పడతాడనే నా ఆశ!" అని నేను తేరుకునేలోపలే వెళ్ళిపోయింది.

ఆ రోజుల్లోనే రాంబాబు సత్యాన్ని చూసి సరదాపడి ఆటల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. వాడు వేసిందే ఒక గంతు! దానికే కిందపడి చెయ్యి విరగ్గొట్టుకున్నాడు. ఎక్స్‌రేలు, ప్లాస్టర్‌కట్లు అన్ని యత్నా...

జరిగాయి. రెండు నెలలపాటు ఒంటి చేత్తో బ్రతికి బయటపడిన తరవాత రాంబాబు ఆటలంటేనే బెదిరిపోయాడు. సుందరం దగ్గర్లో లేకుండా చూసి ఏదో పాడుకునేవాడు. జిల్లేడు దూదిలోంచి దారం తీసినట్లు రాంబాబు పాట పుటుకు పుటుకుమంటూ తెగిపోయేది. బక్కగా ఉండే రాంబాబుకు మా పిల్లలకుకూడా ఇవ్వని ఓవల్టిను, టానిక్కులు ఇచ్చేదాన్ని. కాడ్ లివర్ ఆయిల్ సీసా మూత తెరుస్తూండగానే, మా పిల్లలు భరించలేనట్లుగా ముక్కు మూసుకుని దూరంగా వెళ్ళేవాళ్ళు. రాంబాబుకు అది తాగడం అయిష్టమే కాక, చిన్నతనంగా ఉండేది. "కోడిగుడ్లు తింటాలే, పెద్దమ్మా, ఈ నూనె నా కొద్దు" అన్నాడు. జాలివేసి మానేశాను.

ఒకరోజు రాత్రి పిల్లలందరు పడుకున్నారో లేదో చూసి, పెద్ద దీపం ఆర్పి, అందరికి దుప్పట్లు సరిగ్గా కప్పి నేను పడుకోడానికి వెళ్లాను. మా వారు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. "ఏమిటండీ?" అని అడిగాను. "పిల్లలంతా నిద్రపోయారా?" అని అడిగారాయన. నేను ఔనన్నాక నాతో "నే నొక సంగతి చెబుతాను. తొందరపడకుండా ఆలోచించు! కొన్నాళ్ళు రాంబాబును వేరే ఏదైనా ఊళ్ళో బోర్డింగులో పెట్టి చదివిద్దాం" అన్నారు. నే నేమి ఆలోచించకుండానే "నలుగురు పిల్లలకు చదువులు భరించడమే కష్టంగా ఉంది. పెళ్ళికి కొనుక్కున్న పట్టుచీరలు అన్ని చిరిగిపోయాయి. మళ్ళీ ఒక మంచి పట్టుచీర కొనుక్కోలేకపోయాను. సవితకు పధ్నాలుగేళ్ళు నిండాయి. దానికి మెళ్ళోకి ఒక గొలుసు, చేతులకు గాజులన్నా చేయించలేకపోయాను. ఆరేళ్ళనాడు మీకు జబ్బు చేసినప్పుడు కుటుంబమంతా తిరుపతి వస్తామని మొక్కుకున్నాను. ఇంతవరకు ఆ పని తీరలేదు. రాంబాబును పొరుగూళ్ళో చదివించడమంటే ఎంత ఖర్చు? ఎట్లా భరిస్తాం? మన శక్తి మేరకు ఖర్చుపెడతామేగాని వాణ్ణి గురించి అప్పు చేస్తామా ఏం?" అన్నాను. మా వారు కిటికీలోంచి బైట ఆకాశాన్ని చూస్తూ "పోనీ, వాడి డబ్బే ఖర్చు పెడదాం వాడి చదువుకి" అన్నారు. నాకు మతి పోయింది. "ఏం? వాడొచ్చిన కొత్తలోనే నేనన్నా
ా మాట. తరవాత ఎప్పుడైనా అవసరానికి వాడుకుందామన్నా ఒప్పుకునే
దు, ఇప్పుడీ ఆలోచనెందుకు వచ్చింది?" అని అడిగాను. నిజం

గానే మా ఇంటి తాలూకు అద్దె, పొలంమీద పంట తాలూకు డబ్బు లప్పటి కప్పుడు బాంకులో వెయ్యడమే కాని, రాంబాబు డబ్బు ఒక్క పైసా మా ఇంటి ఖర్చులో పడలేదు. నా చిరాకు పట్టించుకోనట్లుగా మా వారు "పోనీ, వాడిని ఈ స్కూలు మానిపించి మునిసిపల్ స్కూల్లో చేర్పిద్దాం" అన్నారు. నాకు తల తిరిగిపోయింది. "మన పిల్లలకు ఇంగ్లీషు స్కూలూనూ, వాడికేమో జీతాలులేని బడా?" దిక్కులేని వాడెంత బరువయ్యాడండీ మీకు?" అన్నాను దాదాపు ఏడుస్తూ. ఆయనకు కోపం వచ్చింది. "ఛీ, మనిషివి కాదు నువ్వు. మెదడనేది లేదు నీకు. నీతో మాట్లాడ్డం నాది బుద్ధి తక్కువ!" అని విసుక్కున్నారు.

మేం మాట్లాడుకుంటుండగా కిటికీదగ్గిర నీడ పడింది. "ఎవరది?" అన్నాను. "నేనే, పెద్దమ్మా, మంచినీళ్ళు కావలిసి లేచాను" అన్నాడు రాంబాబు. గదిలో పెట్టడం మర్చిపోయాను కాబోలు! సాయంత్రం పడుకునే పక్కలు దులిపి సరిగ్గా వెయ్యడము, గదుల్లో మంచినీళ్ళు పెట్టడము లాంటి చిన్న చిన్న పనులు కూడా చేసేది కాదు మా సవిత. మామాటలు వినలేదుకదా అనుకున్నాను. నేను భయపడినట్లుగానే ఆ మరునాటినుంచి రాంబాబు రాత్రిళ్ళు పొద్దుపోయేవరకు చదవడం మొదలుపెట్టాడు. నేను "పోనీలే, ఇదీ మంచికే" అనుకున్నాను. ఆ తరవాత మళ్ళీ ఎన్నడూ తప్పలేదు రాంబాబు. తెల్లవారి పరీక్ష ఉంటే రాత్రంతా మేల్కొనే ఉండేవాడు. అంత చదివినా సగమే వ్రాసి వచ్చేవాడు. "ఏమిరా?" అంటే "గుర్తు రాలేదు పెద్దమ్మా" అనేవాడు. "పిచ్చి సన్యాసి!" అనుకునే దాన్ని. నిద్ర లేకపోవడంతో, ఆరాటంతో రాంబాబుకు పరీక్షల ముందుగానో, వెనగ్గానో పడకపెట్టడం అలవాటయింది. నెమ్మదిగా ఎస్. ఎస్. ఎల్. సి. లోకి వచ్చాడు రాంబాబు. కొత్త పుస్తకాలు కొనిచ్చిన రోజున "రాంబాబూ, ఈ ఏడాదే నీకు పెద్ద పరీక్ష. పేపర్లో నంబరు వచ్చే పెద్ద పరీక్ష. ఈ ఇంట్లో ఇంతవరకు ఎవరు ఏ పరీక్షా తప్పలేదు. మొదటిసారే పాసయ్యి ఈ ఇంటి పరువు నిలుపు" అన్నాను. వాడు భయంగా పుస్తకాలందుకుంటూ "అట్లాగే పెద్దమ్మా! బాగా చదువుతాగా!" అన్నాడు. ఆ ఏడాదంతా చదువు ధ్యాసతప్ప ఇంకోటి లేకుండా గడిపాడు. పు స్త

చివరి వరకూ బట్టీపట్టాడు. పరీక్షలు మొదలయ్యాక పేపర్లు అవుటయ్యా
యన్నారు. ఒక్క పేపరు మాత్రం రాంబాబుకు ఒక్క రాత్రి ముందుగా
అందింది. పరీక్షలు పూర్తి అయిపోయాయనుకున్నాక, రాష్ట్రంలో రెండు
మూడు నగరాల్లో అన్ని పేపర్లు అవుటయినందున పరీక్షలు మళ్ళీ జరగా
లన్నారు ప్రభుత్వంవారు. మళ్ళీ పరీక్షలు జరిపించడం! అందులో ఎస్.
ఎస్. ఎల్. సి. పరీక్షలు! ఎంత ఖర్చు అన్నారు ప్రభుత్వంలోనే మరి
కొందరు. తర్జన భర్జన జరిగాక మళ్ళీ పరీక్షలు మొదలన్నారు. రాంబాబు
దిగాలుపడిపోయాడు. "ఏమి గుర్తున్నట్లు లేదు. పెద్దమ్మా, మళ్ళీ అంతా
ఎట్లా చదవను?" అన్నాడు. నేనేం చెయ్యగలను? పరీక్షలు మూడు రోజు
లున్నవనగా రాంబాబుకు జ్వరం తగిలింది. చప్పున తగ్గడానికి డాక్టరు
ఏదో ఇంజక్షను ఇచ్చారు. పథ్యం తినీ తినకుండానే పరీక్షలు వ్రాశాడు.
ఫలితాలు తెలిసేవరకూ వాడు మనిషిగా లేడు. అందరూ సినిమాకి వెళదా
మని సరదా పడుతున్నా వాడు ఋషిలాగ కూర్చుండిపోయేవాడు. బల
వంతంచేసి పంపించేవాళ్ళం. ఆ గండం గడిచింది. రాంబాబు పాసయాడు.
సవితకు అప్పుడే కొత్తగా పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళింది. అభినం
దిస్తూ టెలిగ్రాం పంపించింది రాంబాబుకు. వాడు పొంగిపోయాడు. నాకు
కొండెక్కినట్లయింది. మా వారు పిల్లలందరిని పిల్చుకు వెళ్ళి కొత్తబట్టలు
కొనిచ్చారు. తరవాత వారంరోజులకు మార్కులు వచ్చాయి. చూసి మా
వారు పెదివి విరిచారు. ఊళ్ళో ఉన్న మూడు కాలేజీల్లోను దరఖాస్తు
పెట్టించారు. రాంబాబుకు దేంట్లోను చోటు దొరకలేదు. సిగ్గుతో పాలి
పోయాడు. నేను కాస్త తేరుకుని "మాచవరంలో కొత్తగా పెట్టిన కాలేజి
ప్రిన్సిపాల్ మీకు బాగా తెలుసుకదా, వెళ్ళి అడగండి. సీటు దొరక్క
పోదు" అన్నాను. మా వారు కాస్త కఠినంగా "నా కటువంటి అలవాట్లు
లేవని తెలిసికూడా నువ్వట్లా అడగడం వింతగా ఉంది. ఇట్లా మొద
లయితే రేపు పేపర్లు దిద్దేవాడి దగ్గిరికి మార్కుల కోసం వెళ్ళాలి. ఎక్కడ
దీని కంతం?" అన్నారు. వారెంత మొండిమనుషులో తెలిసినందున మళ్ళీ
నోరెత్తలేదు నేను. రాంబాబుకు చివరి ఆశకూడా అణగారిపోయింది.
[illegible]నికి మెడికల్ కాలేజీలో సీటుదొరికింది. విశాఖ వెళ్ళాడు. సత్యం

బి. యస్. సి. పాసయి యం. యస్ సి.కి హైదరాబాదు వెళ్ళాడు. "పోనీ పాలిటెక్నిక్‌లో చేరతావా, రాంబాబూ" అనిఅడిగాను. వాడేమీ ఉత్సాహం చూపలేదు. ఇంట్లో ఒంటరిగా తోచకుండా అల్లాడే రాంబాబును చూచి ఒక రోజు! "పోనీ, టైపునేర్చుకో, రాంబాబూ, రోజు కొంచెం సేపు కాలక్షేపం" అన్నాను. వాడు వెళ్ళిపోయాడక్కడనుంచి. వాడి కళ్ళలో నీళ్ళు తిరగడం గమనించాను. దసరా సెలవలకు సత్యం, సుందరం వస్తారని ఎదురు చూస్తున్నాను. రాంబాబుకు మరీ పిచ్చిపట్టినట్లుంది. వాడికి రాత్రిళ్లు కూడా నిద్రపట్టకపోవడం గమనించాను. ఉన్నట్లుండి జ్వరం పట్టుకుంది వాడికి. పిల్లలు సెలవలకు వచ్చారని పిండివంటలు చెయ్యలేదు సరి దా, పచ్చడిమెతుకులు గతి అయ్యాయి. రాంబాబు జ్వరం సంగతి డాక్టరు కంతుపట్టకుండా ఉంది. కళ్ళు తెరవడంలేదు వాడు! పైగా కలవరింతలు!

ఒంటి గంటయింది. "రాంబాబూ!" అంటూ పిలిచాను. పదిసార్లు పిలవగా కళ్ళు తెరిచాడు వాడు. వాడి నోట్లో మాత్ర వేసి గ్లూకోజునీళ్ళు పోశాను. మింగి మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు. తరవాత నేను నిద్రపోయాను. మరుసటి ఉదయం టెంపరేచరు చూస్తే మార్పేమీ లేదు. ఆ ఉదయం డాక్టరు మా వారితో గదిలో కూర్చుని ఏమిటో చాలా సేపు మాట్లాడారు. పొద్దున ట్రెయినుకు సవిత వచ్చింది. ఆ సాయంత్రం డాక్టరుగారు రాంబాబు దగ్గర సవితనుండమని, మా నలుగురిని ఆయన కారులో ఎక్కించుకుని వాళ్ళింటికి తీసుకు వెళ్ళారు. ఆయన భార్య, పిల్లలు ఏదో పెళ్ళికి వెళ్ళారట. వాళ్ళ డ్రాయింగురూములో మమ్మల్ని కూర్చోబెట్టారు. వాళ్ళ వంటవాడు మా కందరికి చల్లని నిమ్మనీళ్ళు తెచ్చి ఇచ్చాడు. డాక్టరుగారు సిగరెట్టు వెలిగించుకుంటూ "మీతో చాలా ముఖ్యమైన విషయాలు మాట్లాడ్డానికి క్కడకు తీసుకువచ్చాను. మీరందరూ ఎటువంటి తొందరా, ఉద్వేగము లేకుండా సమాధానమివ్వాలి నాకు" అన్నారు. "మీకు రాంబాబు అంటే నిజమైన ఆపేక్ష ఉందా? మీరు కనబర్చే ప్రేమ నటనా?" అన్నారు పిల్లల్నిచూసి. మా కందరికి మనస్సు చివుక్కుమంది. సత్యం కాస్త కూడదీసుకుని "ఆపేక్షకు కొలతలేమిటి? రాంబాబుమీద నాకెప్పుడూ కోపం, ద్వేషం కలగలేదు. అంతమట్టుకు నిజం. ఈ

మీరు రాంబాబుమీద అనకుండా, సుందరంమీద అని అడిగినా, నా సమా
ధానం ఇదే అయిఉండేది" అన్నాడు. డాక్టరుగారు లేచి సత్యం భుజం
మీద చరుస్తూ "చూడు, నేను ముందుగానే చెప్పాను. మీ రెటువంటి
ఉద్రేకం తెచ్చుకోకూడదని. చూడు, సత్యం, ద్వేషం లేదంటే చాలదు.
మనిషి మనుగడకు ప్రేమా, ఆపేక్ష కావాలి. సరే, నీకు రాంబాబుమీద
ఉన్న ప్రేమ ఈ పదేళ్ళలో ఏ విధంగా చూపించేవాడివో చెప్పు" అన్నారు.
సత్యం కాస్త ఆలోచిస్తూ "ప్రేమ ప్రకటించాలనే కాంక్ష నా కెప్పుడూ
కలగలేదు. దాన్ని గురించి నేనెప్పుడూ శ్రద్ధ వహించలేదు. రాంబాబు
మీద ద్వేషం పెంచుకోడానికి అనువైన పరిస్థితుల్లోకూడా నే నాపని
చెయ్యలేదు. ఉదాహరణకు: రాంబాబు నన్ను, సుందరాన్ని అనుకరించా
లని చేసే ప్రయత్నాలలో మేమంటే వాడికున్న అసూయ లీలగా తోచేది
నాకు. నాకు జాలి కలిగేది కాని కోపం రాలేదు. నిజంగా వాణ్ణి చూసి
అసూయ పడవలిసింది మేము. ఎందుకంటే అమ్మ వాడిపైన మాకంటే
ఎక్కువ శ్రద్ధ, ఎక్కువ ఆరాటం చూపేది. నా మనస్సు కాస్త మూలి
గినా, నా అసంతృప్తి ఏ విధంగానూ వ్యక్తం కాకుండా, రాంబాబుమీద
కోపం పెంచుకోకుండా చాల జాగ్రత్తపడేవాణ్ణి" అన్నాడు. నేనూ, మా
వారూ తెల్లబోయాం. డాక్టరుగారు మాత్రం నవ్వుతూనే "చూడు సత్యం,
వ్యక్తం చెయ్యడం, చెయ్యకపోవడం అటుంచు. నీ మీద రాం
బాబుకు, రాంబాబుమీద నీకు అసూయ కలిగిన మాట నిజమంటావు?"
అన్నారు. సత్యం నిస్సహాయంగా "నిజమే" నన్నాడు. "సుందరం,
నువ్వు చెప్పు నీ సంగతి" అన్నారు డాక్టరు. సుందరం కళ్ళలో
నీళ్ళు తిరిగాయి. రుద్ధకంఠాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ "రాంబాబూ,
నేను ఒకే క్లాసులో ఉన్నన్నాళ్ళూ వాణ్ణి వెక్కిరించి, వాడిలో నా మీద
అసూయ రేకెత్తించేవాణ్ణి. అట్లా చేస్తే రాంబాబుకూడా బాగా చదివి మంచి
మార్కులు తెచ్చుకుంటాడని చెప్పింది మా అక్క. వాడు తప్పి నేను పై
క్లాసుకు పోగానే ఆ అలవాటు మానుకున్నాను. ఒక సంవత్సరం అమ్మ
రాంబాబుకు కొత్త పుస్తకాలు కొనకుండా, నా పాతపుస్తకాలిచ్చింది. వాడు
[illegible]డం నేను గమనించాను. వద్దంటే అమ్మ వినదని నాకు తెలుసు.

ఎవరు చూడకుండా ఆ పుస్తకాలు తీసుకువెళ్ళి ఎవరికివ్వాలోకూడా తెలియక, నా పేరు కొట్టేసి, పార్కులో ఒక బెంచీమీద విడిచిపెట్టి వచ్చాను. తరవాత కొత్త పుస్తకాలు కొనిచ్చారు రాంబాబుకు. ఒకసారి మా స్నేహితులెవరో ఏదో మాటల్లో మా పుట్టిన తేదీ అడిగారు. నేను పెద్ద క్లాసులో ఉన్న కారణాన రాంబాబు ఎక్కడ నొచ్చుకుంటాడో అని గబగబా రాంబాబు పుట్టిన తేదీ నేనే చెప్పేసి, నేను వాడికంటే పది నెలలు పెద్దవాణ్ణిగా చెప్పుకున్నాను. రాంబాబు నన్ను చూసి అసూయపడకుండా ఉండాలని చాలా జాగ్రత్తలు తీసుకునేవాణ్ణి" అన్నారు డాక్టరు. "సుందరం నీ తెలివి మెచ్చుకోదగ్గదే కాని, నువ్వు చేసిన పనివల్ల నీకన్నా పెద్దయి, నీకన్నా చిన్న క్లాసులో ఉండటం నామోషీ అయిన విషయమని, ఇతరుల ఎదుట అతని పరువు నువ్వు నిలబెట్టావని రాంబాబుకు అర్థమవుతుందా లేదా? ఆలోచించు" అన్నారు. సుందరం బెదిరిపోతూ "ఔను కాని, నా కప్పుడు ఆ సంగతి తట్టలేదు" అన్నాడు. డాక్టరుగారు "రాంబాబు కూడా మంచి పిల్లవాడు. రోషం పట్టలేక 'కాదు, నేను వాడికంటే ఆరు నెలలు పెద్ద' అని అరిచి ఉంటే, నీకెంత చిన్నతనంగా ఉండేది? మీ రిద్దరు మంచి పిల్లలుకాని పప్పులో కాలేశారు. ఇహమీదట రాంబాబు విషయంలో అనవసరంగా ఎటువంటి జాగ్రత్తలు వహించకుండా మామూలుగా ఉండిపొండి. అదే మీరతనికి చెయ్యగల మేలు- నా మాటలకు నొచ్చుకోకండి. వెళ్ళండి. ఆ పత్రికలు తీసికెళ్ళి బైట లానులో కూర్చోండి" అని పిల్లలిద్దరిని బైటకు పంపారు. ముద్దాయిల్లాగా మేమిద్దరం మిగిలాం.

డాక్టరుగారు మా వారికో సిగరెట్టు ఇచ్చి, తాము ఒకటి వెలిగించుకుంటూ "చూడండి, మీ పిల్లలు రాంబాబును ఉడికించే వాళ్ళన్నారు. మీరెందుకు దాన్ని అరికట్టలేదు?" అన్నారు. అప్పటిదాకా మాటలేకుండా కూర్చున్న నేను ఒకసారి ప్రాణం పోసుకుని "నే నెప్పుడూ అది తప్పని చెప్పేదాన్ని, కాని ఈయన పట్టించుకునేవారు కాదు" అన్నాను, నేరమంతా మా వారిమీద మోపి. మావారు సంజాయిషీ చెబుతున్నట్లుగా "ఔను,

ఆరోగ్యకరమైన అసూయలో నమ్మకముంది నాకు. అందుకే దాన్ని నిరసించలేదు." అన్నారు. డాక్టరుగారు గంభీరంగా "చూడండి, నేను డాక్టరును. 'మంచి వ్యాధి' అన్నాననుకోండి, మీకు నవ్వురాదా? జబ్బు జబ్బే! దాంట్లో మంచేమిటి? అసూయ అసూయే. దానిలో ఆరోగ్యమేమిటి?" అన్నారు. కాసేపు నిదానించి మళ్ళీ అన్నారాయన. "కాని ఇటువంటి నమ్మకం మీకేకాదు చాలామందికి ఉండటం గమనించాను నేను. ఉపాధ్యాయులుకూడా మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థులను ఆకాశానికెత్తేసి, వెనకబడిన విద్యార్థులను చిన్నచూపు చూస్తూంటారు. చాల ప్రమాదకరమైన అలవాటు అది." మా వారు ఆశ్చర్యంగా చూస్తూ "బాగా చదివే విద్యార్థులకు ఉపాధ్యాయుల ప్రశంసకన్నా కోరుకునేదేముంటుంది? అది లేకపోతే, వాళ్ళలో చదవాలన్న ఉత్సాహం చచ్చిపోదా?" అన్నారు. డాక్టరుగారు "కాదు, మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థులకు బహుమతు లిమ్మనండి. అవి బంగారపువైనా బాధలేదు. కాని పొగడ్తల రూపంలో మాటలు ఖర్చుపెట్టకూడదు. తెలివైన పిల్లలు ఎప్పుడు లెక్కువమంచే ఉంటారు. వాళ్ళను గురించిన బాధ్యతకన్నా, క్లాసులో వెనకబడ్డ విద్యార్థుల గురించిన బాధ్యతే ఎక్కువ ఉండాలి టీచర్లకు. అది లేకపోతే, చదువులో వెనకపడ్డ విద్యార్థులు, ఆటపాటల్లో ప్రావీణ్యంలేని విద్యార్థులు అసూయపాలై, అశాంతికి గురై, నానారకాల అలజడులకు నాయకులై, విధ్వంసక చర్యలకు సైతం వెనుదీయక హీరోలవడానికి చూస్తారు" అన్నారు. మాకు మాట రాలేదు. డాక్టరుగారు కాస్త ఆగి నన్ను చూసి "రాంబాబు డబ్బు అతని చదువు ఖర్చుకు ఉపయోగించడానికి మీ రెందుకు సమ్మతించలేదు?" అన్నారు. ఆ మాట ఎత్తితేనే నాకు ఒళ్ళుమంట.

"వాడి డబ్బుతో వాడు బ్రతకడానికి వాడు మా ఇంట్లోనే పెరగాలని లేదు. ఎక్కడైనా పెరగచ్చు. మా ఇల్లు హోటలూ కాదు, హాస్టలూ కాదు" అన్నాను. డాక్టరు నవ్వి "కోపం తెచ్చుకోకండి. మీ కుటుంబ చరిత్ర అంతా మీ వారివల్ల తెలుసుకున్నాను. అసలు కారణం నేను

చెప్పనా! రాంబాబును మీ డబ్బుతో పెంచి చదివించడంతో మీరు మీనాన్న గారిమీద కక్ష సాధించాలనుకున్నారు" అని ఆగారు. అది నిజమే. నా మనస్సులో భద్రంగా దాచుకున్న రహస్యం బైటపడగా సిగ్గుపడ్డానుకాని నిజంకాదని దబాయించలేకపోయాను. ఒప్పుకున్నట్లుగా తల దించుకున్నాను. డాక్టరుగారు "చూడండి, మీరు చేసిన పని రాంబాబుమీద శాశ్వతంగా దెబ్బతీసింది. మీ మధ్య బ్రతకడానికి విసుగై, ఏదో ఒక క్షణాన అతనికి ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళి బ్రతకడానికిలేకుండా, మీ ఎడల విశ్వాసం కలిగిఉండడం అతని కనీస అవసరం కట్టి పడవేసింది. అవసరంలేని మీ ఆప్యాయత అతని రెక్కలు విరిచి, మీ దగ్గిర అప్పు తీసుకుని తీర్చలేనివాడుగా తీర్చిదిద్దారు!" అన్నారు. నేను పట్టలేక వెక్కి వెక్కి ఏడ్చాను. డాక్టరుగారు నా ఏడుపేమీ పట్టించుకోకుండా "పోటీ స్వభావంవల్ల లాభం జరిగేది సమానుల మధ్యనే. లేకపోతే పొట్టేలు కొండను ఢీకొన్న తంతవుతుంది. మీ పిల్లలతో రాంబాబుపోటీ అటువంటి ఫలితాన్నే ఇచ్చింది. పిల్లల్ని పందెపుగుర్రాలలాగ పెంచకూడదు. చదువు మనిషికి చాలా అవసరం. ఎవరూ కాదనలేరు. కాని చదువంటే పరీక్షలు పాసవడమనే భ్రాంతి పోవాలి. సముద్రపు ఒడ్డు, కాలవగట్టు, చింతతోపులు లేని ఈ ఊళ్ళోకూడా, రాంబాబు కిటికీలోంచి చెట్లవంక, వాటిపై కువకువలాడే పక్షులవంక, ఆకాశంలో మబ్బులవంక చూడడం అలవాటు చేసుకున్నాడు. అతన్ని ఏ పెయింటింగ్‌స్కూల్లోనో చేర్పించి చూడాలిసింది. తరవాత మనోవికాసానికి ఎన్ని మంచి పుస్తకాల్లో పరీక్షల బెడద లేకుండా చదువుకునేవాడు. అది చాలదూ? ఇప్పుడు తనికి వచ్చిన జ్వరం మీరు తెచ్చిపెట్టిందనడం లేదు నేను. కాని, ఆ పోటీలతోటీ, పరీక్షలతోటీ శరీరాన్ని శిధిలం చేసుకున్నాడు. ఇప్పుడు ఏ కొత్త జబ్బు వచ్చినా, దాన్ని ఎదుర్కోలేక లొంగిపోతున్నాడు. రాంబాబు ఆరోగ్యంగా బ్రతకాలంటే భవిష్యత్తులో మీరు మారాలి. అతని డబ్బుతో అతన్నెక్కడైనా ఆర్టుస్కూల్లో చేర్పించి శిక్షణ ఇప్పించండి. రాంబాబు అప్పుడుగాని మనుష్యుల్లో పడడు" అన్నారు. మేము ఇంటికి వచ్చేశాము.

తరవాత వారం రోజులకు రాంబాబుకు పథ్యం పెట్టాము. ఇప్పుడు వాడు కళాకేంద్రంలో చిత్రకళ నేర్చుకుంటున్నాడు. నేను, మా వారు ఇంట్లో మిగిలిపోయాం. సెలవల్లో వస్తున్నారు పిల్లలింటికి. పూర్వంకంటే మా ఇంట్లో సందడి ఎక్కువైంది. మా పిల్లల గొంతుతో సమంగా రాంబాబు గొంతు వినిపిస్తూంది. మా కంతకంటే ఏం కావాలి?

—o—